క్లుప్తంగా

సంక్షేమ పాలకుడిని ఆదరించండి



కొత్తగా మంజూరైన పింఛన్ నగదు లబ్ధిదారుకి అందజేస్తున్న రాజారెడ్డి

దుత్తలూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆదరించాలని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ పథకాల రూపంలో ఆర్థిక లబ్ధి చేకూరుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణాన్ని ప్రతి ఒక్కరూ తీర్చుకోవాలన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వర్షాలు సమృద్ధిగా కురవడమే కాకుండా సంక్షేమ పథకాలు ఎన్నో అమలు చేశారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కరువు కాటకాలు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. నేడు లోకేష్ పాదయాత్ర చేస్తుంటే వర్షాలు కురవకపోగా మబ్బులు కూడా రావడం లేదన్నారు. ఈ తేడాను ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్య చౌదరి, సర్పంచ్ యనమల సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్‌పి.కొండారెడ్డి, సింగవరపు గంగాధరరెడ్డి, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, ఎంపీడీఓ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన



పెన్నానదిలో నిమజ్జనానికి పూజాసామగ్రితో వెళ్తున్న భక్తులు

సంగం: కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా లక్ష కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అనంతరం భక్తులు పూజా సామగ్రితో పెన్నానది వద్దకు ఊరేగింపుగా వెళ్లి కుంకుమను పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

మేకపాటికి ఎఫ్‌ఏల వినతి



మేకపాటికి సమస్యలు వినతిపత్రం అందిస్తున్న క్షేత్ర సహాయకులు

వరికుంటపాడు: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న క్షేత్రసహాయకుల డిమాండ్లను పరిష్కరించేలా చూడాలని శుక్రవారం పలువురు క్షేత్ర సహాయకులు వరికుంటపాడుకు వచ్చిన ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించి విన్నవించారు. కరోనా కష్టకాలంలో కూడా బాధ్యతగా విధులు నిర్వహించామన్నారు. తమకు కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, మండల స్థాయిలో బదిలీల సౌకర్యం కల్పించాలని, తదితర డిమాండ్లు విన్నవించారు.



ఉదయగిరి: మెయిన్‌బజార్‌కు చెందిన భూపాలెం శ్యామలాదేవికి ఇంటి వద్దనే పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అబ్దుల్‌మునాఫ్



దుత్తలూరు: జలగం సుబ్బమ్మ అనే వృద్ధురాలి గృహానికి వెళ్లి పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ కంభం రామలక్ష్మమ్మ



చేజర్ల: నాగులవెలటూరుకు చెందిన ఉల్లిపాయల రావమ్మకు వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ తోటేటి ప్రసాద్



ఏఎస్‌పేట: కొండమీదకొండూరుకు చెందిన లక్ష్మమ్మ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులరెడ్డి, వలంటీర్ తిరుమల

పండగలా పింఛన్లు

శుక్రవారం నుంచి పింఛన్ల పండగ ప్రారంభమైంది. ఇప్పటికే ఉన్న పింఛన్లతో పాటు ఈ నెల నుంచి కొత్త పింఛన్లు సైతం మంజూరు కావడంతో లబ్ధిదారుల్లో ఆనందానికి హద్దుల్లేకుండా పోయింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో పాటు వైఎస్సార్‌సీపీ ప్రతినిధులు సైతం కలిసి కొత్తగా పింఛన్ మంజూరైన లబ్ధిదారుల వద్దకు వెళ్లి మీకు ఈ నెల నుంచి పింఛన్ మంజూరైందంటూ చెప్పగానే వారి కళ్లలో, ముఖాల్లో ఆనందం తాండవించింది. లబ్ధిదారులు ఇళ్ల వద్దకే వెళ్లి నడవలేని వృద్ధులు, దివ్యాంగులతో పాటు పనులకు వెళ్లే ఒంటరి మహిళలు, వితంతువులకు పింఛన్ల అందజేసే కార్యక్రమం శుక్రవారం వేకువజాము నుంచే ప్రారంభమైంది.



సంగం: జెండాదిబ్బలో రమణమ్మకు పింఛను ఇస్తున్న వలంటీర్ అనిత



కలిగిరి: భీమవరపు మహాలక్ష్మమ్మకి వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ జెడా ఇజ్రాయిల్



అనంతసాగరం మండలం వరికుంటపాడుకు చెందిన వల్లూరు రాజగోపాల్‌రెడ్డికి కొత్తగా మంజూరైన పింఛన్‌ను అందజేస్తున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పాడి పవిత్ర



ఆత్మకూరు మండలం మహిమలూరులో రమణమ్మ అనే లబ్ధిదారుకు పింఛను పంపిణీ చేస్తున్న సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, వార్డు సభ్యుడు నాగేశ్వరరావు

పేదల్లో ఆత్మగౌరవం పెరిగేలా జగనన్న పాలన

- పేద పిల్లల బంగారు భవిష్యత్‌కు కఠోరమైన శ్రమ
- పేదల ఆస్తులకు చట్టబద్ధతకు కలిన నిర్ణయాలు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రతి అక్క,చెల్లెమ్మ, ప్రతి అన్న, తమ్ముడు, ప్రతి అవ్వ, తాతల సంక్షేమమే లక్ష్యంగా పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదిగి, ఆత్మగౌరవంతో బతికేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో శుక్రవారం ఎమ్మెల్యే 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి గడిచిన నాలుగేళ్లలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి వివరించారు. అనంతరం లబ్ధిదారులకు అందించిన లబ్ధి వివరాలు తెలిపే బుక్‌లెట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే ప్రజలతో మాట్లాడుతూ అమెరికా చదువులకు ఈ ఏడాది దేశం మొత్తం మీద 30 మంది ఎంపికైతే, మన ఒక్క రాష్ట్రం నుంచే ఐదుగురు గురుకుల విద్యార్థులు ఎంపికయ్యారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సీఎం జగన్ అమలు చేస్తున్న అనూహ్యమైన సంస్కరణలు, అభివృద్ధి వల్లనే ఇది సాధ్యమైందన్నారు. నాణ్యమైన విద్యను పిల్లలకు అందిస్తే ఆ కుటుంబాలు సమాజంలో ఆత్మస్థైర్యంతో జీవిస్తాయని ముఖ్యమంత్రి భావిస్తున్నారన్నారు. పేదల ఆస్తులకు చట్టబద్ధత కల్పిస్తే అందరికీ ఉన్నట్లుగానే తమకు ఆస్తులు ఉన్నాయనే ఆత్మవిశ్వాసంతో ఉంటారనే సామాజిక కోణంలో అసైన్డ్‌భూములు రిజిస్ట్రేషన్లు, ఇంటి స్థలాలకు డాక్యుమెంట్లు, ప్రభుత్వం ఇచ్చే కాలనీ ఇళ్లు కూడా నిర్దిష్టమైన కాలపరిమితి ముగిసిన తర్వాత అవసరాల కోసం అప్పులు, అమ్మకాలు చేసుకు అవకాశాలు కల్పించారని ఎమ్మెల్యే వివరించారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం సమగ్ర సర్వేలో గ్రామాల్లో, పట్టణాల్లో డ్రోన్లతో సర్వే చేయించి భూ వివాదాలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి మండలాల స్థాయిలో మొబైల్ కోర్టులు కూడా నడిచేలా చర్యలు, మున్సిపల్ శాఖ పరిధిలో వెరిఫికేష పూర్తయి, ఓఆర్ఐ ప్రక్రియ ముగింపు, ప్రత్యేక బృందాల ఏర్పాటు చేసి సర్వే ప్రక్రియను ముమ్మరం చేస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కనమర్లపూడి వెంకటనారాయణ, గంధం ప్రసన్నాంజనేయులు, కనుపర్తి రాజశేఖర్, పల్లపు కొండలరావు, చల్లా లక్ష్మీరావు, యనమల మాల్యాద్రి, తన్నీరు ఆదినారాయణ, తన్నీరు మస్తాన్‌బాబు, దేవర్ల ఏడుకొండలు, కుందుర్తి కామయ్య, ఈతముక్కల చందు, నాగేశ్వరమ్మ, షేక్ నాయబ్ రసూల్, షేక్ అబ్దుల్ రహీం, శారద ఫణీంద్ర పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

జలదంకి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చే రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలో చుక్కల భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చుక్కల భూముల సమస్యల పరిష్కారానికి సిబ్బందికి సూచనలు అందజేశారు. భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం కింద ప్రభుత్వం చేపడుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పక్కాగా చేపట్టాలన్నారు. పౌరసరఫరాల శాఖ పని తీరు, నీటి తీరువా వసూళ్ల తదితరాలపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం జలదంకి-1 సచివాలయంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. సచివాలయంలో రికార్డులను పరిశీలించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయ ఉద్యోగులు యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. గ్రామ సచివాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, డీటీ భరత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కావలి ఆర్డీఓ శీనానాయక్

ఓట్ల తొలగింపులో నిష్పక్షపాతంగా వ్యవహరించండి

జలదంకి: ఓట్ల తొలగింపు విషయంలో బూత్ లెవల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఉదయగిరి ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారిణి జి. సువర్ణమ్మ అన్నారు. శుక్రవారం ఆమె తహసీల్దార్ కార్యాలయంలో మండల ఓటర్ల జాబితాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జలదంకి, గట్టుపల్లి, చింతలపాళెం గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ డబుల్, డెత్ ఓట్ల తొలగింపులో ఏదైనా ఒత్తిళ్లు వస్తే తమ దృష్టికి బీఎల్వోలు తీసుకురావాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని తెలిపారు. ఓటర్ల జాబితా పరిశీలన, సవరణలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఓట్ల తొలగింపులో నిర్లక్ష్యం, అవకతవకలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ భరత్, బీఎల్వోలు పాల్గొన్నారు.



జలదంకిలో డెట్ ఓట్ల వివరాలను తెలుసుకుంటున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి సువర్ణమ్మ

వలంటీర్ల సేవలు దేశానికి ఆదర్శం

- నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి

వరికుంటపాడు: గ్రామ, వార్డు వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గ్రామ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో రాజారెడ్డి మాట్లాడారు. ఈ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు చిరస్మరణీయమన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి చేకూర్చుతున్న ఘనత వలంటీర్లదేనన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకుల మీద కన్న నమ్మకాన్ని వలంటీర్ల మీద పెట్టుకుని వారికి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిరగకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ఇంటివద్దకే సీఎం అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్ వ్యవస్థ అందుబాటులో లేకపోయి ఉంటే మనం తీవ్రంగా నష్టపోయేవారమన్నారు. ఆ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి వలంటీర్లు పనిచేశారన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి రాష్ట్ర సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ, మండల కో-ఆప్షన్ సభ్యుడు జిలానీ, మండల ఉపాధ్యక్షుడు డి.మదు, సీహెచ్ మధు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆంద్రా బాలగురవారెడ్డి, జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, మాజీ మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొడ్డు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

ముగిసిన బాలల క్రీడల పోటీలు

కావలి: స్థానిక విశ్వోదయ డాక్టర్ రామ్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ డీఆర్ బాలల దినోత్సవం శుక్రవారం వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో ఫైనల్ పోటీలు పోటాపోటీగా, హోరాహోరీగా ఉత్కంఠగా సాగాయి. పీడీ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్ రెడ్డి, రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ప్రిన్సిపల్ ఇన్‌చార్జి ఆర్.మాల్యాద్రి పర్యవేక్షణలో జరిగాయి.



క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

పౌరహక్కులకు ప్రభుత్వం అండ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): రాజ్యాంగం ద్వారా సంక్రమించిన పౌరహక్కుల పరిరక్షణకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మర్రిపాడు తహసీల్దారు ఆనందరావు అన్నారు. మండలంలోని రామానాయుడుపల్లిలో శుక్రవారం జరిగిన పౌరహక్కుల దినోత్సవంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు శేషం సుదర్శన్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా ప్రతి ఒక్కరూ తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులందరికీ అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుల వివక్ష, అంటరాని తనం వంటి పరిణామాలు ఎక్కడ సంభవించినా చట్ట ప్రకారం పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, ఆర్ఐ సురేంద్ర, పంచాయతీ కార్యదర్శి అభినాష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితుడు

చేజర్ల: మండలంలోని కాకివాయి పొలాల్లో జరిగిన మోటార్ల చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ దొంగ తనంలో మోటార్లు విషయమై రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతసాగరం మండలం సోమశిలకు చెందిన ఆ వ్యక్తిని పూర్తిస్థాయిలో విచారిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఉదయగిరి: మండలంలోని బండగానిపల్లి పంచాయతీ కొత్తపల్లిలో శుక్రవారం సొసైటీ మాజీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద పంచాయతీకి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పంచాయతీలోని బిజ్జంపల్లి, బండగానిపల్లి, కొత్తపల్లి, కృష్ణారెడ్డిపల్లి, లింగమనేనిపల్లి, తదితర గ్రామాలలో నూతన సిమెంటురోడ్లు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

నేడు కలిగిరిలో రక్తదాన శిబిరం

కలిగిరి: కలిగిరిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా శనివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు కాటం రవీంద్రారెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ శిబిరంలో దాతలు, యువత, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. అన్ని పంచాయతీల్లో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.